
# మేలుకొలుపు

## పి. గోవర్ధన్ రెడ్డి



**''శ్రీ మద్రమారమణ గోవిందో హరి'' అంటూ లయ బద్ధంగా వినపడదంతో పేపరు చదువుతున్న ప్రవీణ్ తల ఎత్తి చూశాడు. తన ఎదురుగా ముప్పై సంవత్స రాల యువకుడు హరిదాసు వేషంతో నిలబడి ఒక చేతిలో చిడతలతో, తలపై అక్షయపాత్రతో కనిపించాడు. ఇంతలో అప్పటి వరకు బుద్ధిగా హోమ్ వర్క్ చేసుకుం టున్న ప్రవీణ్ కుమార్తె దివ్య ''మమ్మీ హరిదాసు వచ్చాడు'' అంటూ వంటగదిలోకి పరుగు తీసింది.**

అది చూసిన ప్రవీణ్ ''ఏమయ్యా? ఏదైనా పని చేసుకోకూడదు? ఎందుకు ఈ పగటి వేషం? చూడ డానికి చక్కగా వున్నావు'' అంటుండగా ''అయ్యో! ఏమిటండీ అలా అనేశారు. ఈ సంక్రాంతి పండుగ నెలలో ఇంటి ముందు వేసిన రంగవల్లులూ, గొబ్బె మ్మలను తొక్కుతూ పాటలు పాడుతూ హరి దాసు రావడం, వారికి బియ్యం వేసి దీవె నలు అందుకోవడం చాలా మంచిదండీ. మీ నగరాల్లో ఆ సెంటిమెంట్లు లేవు గాని మా పల్లెటూర్లలో మేము హరిదాసుల కోసం ఎదురు చూసేవాళ్లం'' అంటూ చేతిలో బియ్యం గ్లాసుతో గుమ్మంలోకి వచ్చింది ప్రవీణ్ భార్య నీలిమ. ఆమె తెచ్చిన బియ్యాన్ని ఒంగి తన తలపై అక్షయపాత్రలో వేయించుకున్న హరిదాసు వీరి మాటలను వింటూనే ''దీర్ఘాయుష్మాన్ భవ'' అంటూ పక్క ఇంటి ముందుకు వెళ్లాడు.

***

''హలో! ప్రవీణ్‌గారు. మీ పాప దివ్యకు యాక్సిడెంట్ అయింది. ఆసుపత్రిలో ఉంది. వెంటనే రండి'' అంటూ స్కూల్ నుంచి ఫోన్ రావడంతో హడావిడిగా ఇంటికి బయలుదేరాడు ప్రవీణ్. ఇంటికి వెళ్లి నీలిమను తీసుకుని స్కూటర్‌పై ఆసుపత్రికి వెళ్లాడు. స్కూటర్ దిగి ఆసుపత్రిలోనికి వెళుతున్న దంపతులకు ఎదురు వచ్చిన ప్రిన్సిపాల్ ''మీ దివ్య ఆటోకింద పడిందండి. తలకు దెబ్బ తగిలింది. రక్తం బాగాపోయిందండి'' అని చెప్పింది.

ఇంతలో ఏడుస్తున్న నీలిమను ఓదారుస్తు ''ఆటో నెంబర్ రాసుకున్నారా? పోలీసు కంప్లైంటు ఇచ్చారా?'' అంటూ దివ్య ఉన్న గదిలోకి పరుగు లాంటి నడకతో వెళ్లాడు ప్రవీణ్.

''ఎలా ఉంది డాక్టర్ మా పాపకు'' అడిగాడు ప్రవీణ్.

''మీరు చాలా అదృష్టవంతులండీ! దెబ్బ బాగానే తగిలింది. కానీ సమయానికి హాస్పిటల్‌కి తీసుకు వచ్చారు. రక్తం ఎక్కించాము. ఇపుడు బాగానే వుంది'' అన్నాడు డాక్టర్.

''అమ్మా.. దివ్యా'' అంటూ కన్నీళ్లను తుడుచుకుంటూ పాప మంచంపై కూర్చుంది నీలిమ.

''ఆ ఆటో డ్రైవర్‌పై పోలీస్ కంప్లైంట్ ఇద్దాం'' అన్నాడు ప్రవీణ్.

''సార్! దివ్యను హాస్పిటల్‌లో చేర్పించింది ఆ ఆటో డ్రైవరే'' అంది స్కూల్ ప్రిన్సిపాల్.

''అవును సార్! హాస్పిటల్‌లో చేర్పించడమే కాదు, మీ పాపకు అవసరమైన రక్తం కూడా అతనే ఇచ్చాడు సార్. సమయానికి అతని రక్తం గ్రూపు మీ పాప రక్తం గ్రూపు సరిపోయింది కాబట్టి మీ పాపకు ప్రమాదం తప్పింది'' చెప్పాడు డాక్టర్.

అప్పటి వరకూ కోపంగా ఉన్న ప్రవీణ్ ఆ మాట వినగానే ఆశ్చర్యపోయాడు. ''కళ్లముందు యాక్సిడెంటు చేసి వెళ్లిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి మంచివాళ్లు ఇంకా వున్నారా?'' అన్నాడు ప్రవీణ్. తిరిగి తనే ''డ్రైవర్ ఎక్కడున్నాడు. అతడిని చూడాలి డాక్టర్'' అన్నాడు.

''అడుగో..అతనే'' అంటూ బెడ్‌మీదనుంచి లేచి చొక్కా వేసుకుంటున్న ఆటో డ్రైవర్‌ను చూపించాడు డాక్టర్.

అతడిని చూడగానే ఎక్కడో చూసినట్లు అనిపించింది ప్రవీణ్‌కు. ''నువ్వు..'' అంటుండగానే ''ఇతను సంక్రాంతి నెలలో మన ఇంటికి వచ్చిన హరిదాసండీ'' చెప్పింది భర్త వెనకే వచ్చిన నీలిమ.

''అవునా'' అంటూ ఆ రోజు జరిగిన సంఘటనను గుర్తు తెచ్చుకుంటూ ''నీ పేరు?'' అడిగాడు ప్రవీణ్.

''నాయుడండీ'' చెప్పాడు ఆటో డ్రైవర్. ''నన్ను క్షమించండి సార్! అనుకోకుండా రోడ్డు దాటుతున్న పాప నా ఆటోకింద పడింది. పాపను చూడగానే మీ పాప అని గుర్తు పట్టాను. రక్తం బాగా పోవడంతో వెంటనే హాస్పిటల్‌లో చేర్చాను. పాప మెడలో వున్న ఐడెంటిటీ కార్డుపై ఉన్న స్కూలు ఫోన్ నెంబర్ చూసి ఫోన్ చేశాను సార్'' అన్నాడు నాయుడు.

''కాదు బాబూ.. నీవే నన్ను క్షమించాలి. ఆ రోజు నీ గురించి తప్పుగా మాట్లాడాను. కానీ ఈ రోజు నీవు మా పాపను కాపాడావు.. అయితే నువ్వు ఆటో నడుపుతున్నావా? ఆ రోజు హరిదాసు వేషం? '' అర్థం కానట్టు అడిగాడు ప్రవీణ్.

''సార్.. అది మా తాతల నుంచీ వచ్చిన వారసత్వం. మా నాన్న కూడా దానినే వృత్తిగా కొనసాగించాడు. గత సంవత్సరం మానాన్న ఆరోగ్యం బాగాలేక చనిపోయాడు. చనిపోతూ తన చివరి కోరికగా ఆ వృత్తిని కొనసాగించమని నన్ను కోరాడు. ఆయన కోరిక మేరకు అదీ వంశంపారంపర్యంగా వస్తుండటంతో నాకు తప్పలేదు సార్'' అన్నాడు నాయుడు. తిరిగి తనే మాట్లాడుతూ ''కానీ ఈ రోజుల్లో పెద్దగా జనాదరణ లేకపోయినా మానాన్న చివరి కోరిక కావడంతో కాదనలేకపోయాను. అదీగాక మా గ్రామంలో సరైన ఉపాధి లేకపోవడంతో నగరంలోకి రావలసి వచ్చింది. సంవత్సరంలో కేవలం సంక్రాంతి నెలలో మాత్రమే హరిదాసుగా వేషం కడుతున్నా. మిగిలిన రోజుల్లో ఆటో నడుపుతూ బతుకుతున్నాను. మీకు ఇబ్బంది కలిగించినందకు నన్ను క్షమించండి సార్'' అన్నాడు నాయుడు.

''అది కాదు నాయుడు. నీవే నన్ను క్షమించాలి. చిన్నప్పటినుంచి నగర జీవితానికి అలవాటు పడిపోయాను. అందుకే సంప్రదాయ విలువల్ని, ప్రాచీన కళల్ని గుర్తించలేకపోయాను. నీలోని కళాకారుడిని అవమానించాను. కానీ నీవు నీలోని నిజాయితీని నిలబెట్టుకున్నావు. ఆ రోజు నీకు గ్లాసుడు బియ్యం పెడితే ఈ రోజు నీ మా పాపను బతికించావు. నిజంగా ఈ రోజు నాలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించావు. నన్ను మేలుకొలిపావు. నువ్వు ఈ సమయంలో నాకు హరిదాసుగా కాదు, ఆదివిష్ణువుకు ప్రతిపరూపంగా కనిపిస్తున్నావు'' అన్నాడు ప్రవీణ్.

''మా పాపకు రక్తదానం చేశావు. మా పాప ప్రాణాలు కాపాడావు. నీకు ఏమిచ్చినా రుణం తీరదు'' అంటూ ఆ దంపతులు కన్నీటితో రెండు చేతులు జోడించారు.

*

## లింగపూజ



దేవతల్లో ఎవరికీ లేని విధంగా ఒక్క శివునికి మాత్రమే లింగపూజ ఉంది. లింగపూజ చేయడం కేవలం శివునికి మాత్రమే పూజ చేసినట్టు కాదు. లింగం అడుగున బ్రహ్మ, మధ్యలో విష్ణువు, అగ్రభాగాన శివుడు ఉన్నారు. అందుచేత లింగపూజ సర్వదేవతారాధనం అవుతుందని, ఇది చాలా విశిష్టమైనదని శివ పురాణం చెబుతుంది. శివలింగాలు పలు రకాలు. ఒక్కో రకం లింగాన్ని పూజిస్తే ఒక్కో రకం ఫలం దక్కుతుంది.

చందన లింగం: నాలుగు భాగాలు చందనం, మూడుభాగాలు కుంకుమ, రెండు భాగాలు కస్తూరి కలిపి లింగాన్ని తయారు చేయాలి. దీన్ని పూజిస్తే శివసాయుజ్యం లభిస్తుంది.

పుష్పలింగం : మొగలి, సంపెంగ పూలను శివపూజకు వినియోగించరు. ఈ రెండు రకాల పూలను మినహాయించి మిగిలిన పూలతో లింగాన్ని తయారు చేసి పూజిస్తే రాజ్యం లేదా ఉన్నత పదవి సిద్ధిస్తాయి.

వంశాంకుర లింగం : వెదురు చిగుళ్లతో చేసిన లింగం. దీన్ని పూజించడం వలన వంశం వృద్ధి జరుగుతుంది.

సితాఖండ లింగం : పటికబెల్లంతో చేసిన లింగం. దీని పూజ ద్వారా ఆరోగ్యం ప్రాప్తిస్తుంది.

దధి దుగ లింగం : గడ్డ పెరుగు తీసుకోవాలి. దీనికి పాలు కలిపి లింగం చేసి పూజించాలి. దీంతో సర్వసంపత్కరం ప్రాప్తిస్తుంది.

దూర్వాకాండ లింగం : గరికతో చేసిన లింగాన్ని పూజించడం ద్వారా అకాల మృత్యువు దరి చేరదు.

తిలపిష్ట లింగం : రుబ్బిన నువ్వుల ముద్దతో లింగం తయారు చేయాలి. దీనిని పూజిస్తే ఎలాంటి కోరికలయినా తక్షణమే ఫలిస్తాయి.